# హృదయస్పందన

రావినూతల సువర్ణా కన్నన్




అర్థరాత్రి పన్నెండు గంటలయింది. ఊరంతా గాఢ నిద్రలోకెళ్ళిపోయింది. సాగరతీరాన వున్న పెద్ద భవంతిలోని గదిలో విశాలమైన మెత్తని బెడ్‌మీద పడుకున్న నాకు మాత్రం రెప్ప మూత పడ్డంలేదు. ఏవేవో దృశ్యాలు కళ్ళముందు కదలాడుతున్నాయి. గుండెల్లో ఏదో తెలియని బాధ! పరిపరివిధాలుగా పోతున్న మనసుని అదుపులో పెట్టుకోవాలని మెల్లగా లేచి బాల్కనీలో కొచ్చాను. చల్లనిగాలి విసురుగా వీచి శరీరాన్ని ఒణికించింది. పైటకొంగు భుజాల నిండా కప్పుకొని అతి చేరువుగావున్న సముద్రంకేసి చూశాను. వెన్నెలకిరణాలు ఎగసిపడుతున్న అలలమీదపడి వింతగా మెరుస్తున్నాయి. నిండు జాబిల్లి చుక్కకన్నెతో ముచ్చట్లాడుతున్నాడు. భవంతి చుట్టూ వున్న పూలచెట్లు సువాసనలని వెదజల్లుతున్నాయి. ప్రకృతి అత్యంత మనోహరంగా వుంది.

ఎందుకో చాలా రోజుల తర్వాత నా బాల్యం గుర్తుకొచ్చింది. మాపల్లె, పల్లెలోని స్నేహితులు, వాళ్ళతో కలిసి చేసిన అల్లర్లు కళ్ళముందు నిల్చి నన్ను మధుర లోకాలకి తీసికెళ్ళాయి. నాన్న ప్రేమ నన్నెక్కడికో తీసికెళ్ళిపోయింది.

నిజం! నాన్నకి నేనంటే ప్రాణం. నేను ఏడ్చినా అందులో ఓ మంచి రాగం వుందన్నట్టు మాట్లాడేవారు. నేను తొలికవిత రాసినప్పుడు వర్డ్స్‌వర్త్‌ని మించిపోతానన్నారు. మినీకథ రాసినప్పుడు శరత్‌చంద్రుడే మళ్ళీ నా రూపంలో పుట్టాడని మురిసిపోయారు. ఇంక జయసూర్య సరేసరి! నా రచనలు చదివి ఆకాశానికెత్తేసేవాడు.

జయసూర్య నా బాల్యమిత్రుడు. నాకన్నా రెండేళ్ళు పెద్దవాడైనా నన్నే గురువుగా భావించేవాడు.

అతనికి నా రచనలంటే చాలా ఇష్టం. నేనంటే మరీ మరీ ఇష్టం. నాకూ అంతే! ఇద్దరం కలిసి చెట్లంట, పుట్టలంట తిరిగేవాళ్ళం. జీడీలు జామకాయలు లాంటివి కాకెంగిలి చేసుకుని తినేవాళ్ళం. చీటికీ మాటికీ పోట్లాడుకునేవాళ్ళం. మళ్ళీ వెంటనే ఒకటయిపోయి ఆటల్లో పడిపోయేవాళ్ళం.

నాకు పెళ్ళయి డాక్టర్ కిరీటితో కలిసి వెళ్ళిపోతుంటే ఆడపిల్లకన్నా అధ్వాన్నంగా ఏడ్చాడు. కొన్ని నెలలదాకా కోలుకోలేదని అమ్మ ఉత్తరం రాసింది కూడా.

కిరీటితో నా జీవితం నవ్వులనదిలో పువ్వులనావలా సాగింది. ఆ ఆనందతరంగాల్లో తేలిపోతున్న నేను జయసూర్యని తొందరగానే మర్చిపోయాను. కానీ ఇన్నాళ్ళ తర్వాత.... కాదు... ఇన్నేళ్ళ తర్వాత అతను గొప్ప కార్డియాలజిస్ట్ డాక్టర్ జయసూర్యగా ప్రత్యక్షమయ్యాడు. అదీ కిరీటి తీసుకొచ్చిన ఈ గెస్ట్‌హౌస్‌లో. ఈ గెస్ట్‌హౌస్ చాలా బావుంటుందనీ, తనకి తెలిసిన వాళ్ళదనీ, ఇక్కడ రెండు రోజులుందామని చెప్పాడు కిరీటి. మేం వచ్చిన పది నిమిషాలకల్లా వచ్చాడు జయసూర్య. కిరీటి అతన్ని పరిచయం చేసినపుడు నేను గుర్తుపట్టనేలేదు. తనుమాత్రం ఎప్పటిలా మధురంగా నవ్వుతూ -

"ఎలా వున్నావ్ మున్నీ?" అన్నాడు.

తృళ్ళిపడ్డాను.

మున్నీ... మున్నీ?.... జయసూర్య ఒక్కడే నన్నలా పిల్చేవాడు.

"జయసూర్యా! నువ్వా!" అన్నాను ఆనందాశ్చర్యాలతో.

"జయసూర్య కాదు! జయ!" నవ్వాడతను.

"నిజమే! అతన్ని నేనలాగే పిల్చేదాన్ని!"

"ఓ! ఎన్నాళ్ళయింది జయా నిన్ను చూసి!" అన్నాను అతని చెయ్యి పట్టుకుని ఊపేస్తూ. తర్వాత కూర్చుని ఎన్నో కబుర్లు చెప్పుకున్నాం. బాల్యస్మృతుల్ని నెమరువేసుకున్నాం. ఒకళ్ళ గురించి ఒకళ్ళు తెలుసుకున్నాం. మా మాటలన్నీ చిరునవ్వుతో వింటున్నాడు కిరీటి.

"మున్నీ! నువ్వింత మంచి రచయిత్రివైనందుకు నేనెంత పొంగిపోతున్నానో తెలుసా? నీ రచనలన్నీ నా లైబ్రరీలో దాచుకున్నాను. అన్నట్టు మున్నీ! ఈ గెస్ట్‌హౌస్ మందే! కావాలని సముద్రపొడ్డున కట్టించాను. అదిగో ఆ బాల్కనీలోంచి చూస్తే ఉరకలేస్తున్న సముద్రమే కాదు. మరెన్నో సుందర దృశ్యాలు కనిపిస్తాయి. నీ నవలకో మంచి ప్లాట్ దొరుకుతుంది! అందుకే కొన్నాళ్ళిక్కడుండమని కిరీటితో చెప్పాను. మీకేం కావాలన్నా నౌకరు రంగయ్య ఉన్నాడు. మీకెలాంటి ఇబ్బందీ

## అయోమయంలో 'ఐస్'

*ప్రస్తుతం ఐశ్వర్యారాయ్‌కి దిక్కుతోచడం లేదట. ఒక ప్రక్క కరిష్మా, మరో ప్రక్క కరీనా మధ్యలో ప్రీతీ జింతా. ఇలా ఎవరికి వారు రేసులో ముందుంటుంటే.... తన పరిస్థితి ఏమిటో దిక్కు తోచడం లేదంటుంది ఐస్. అందుకే అయిందానికీ కానిదానికీ గోవిందాని సలహా అడుగుతూంది. ప్రస్తుతానికి గోవిందా సెల్‌లో 'ఐస్'కి బందీ అయ్యాడు... ఇదీ ఎంతకాలమో!*



ఉండదు!" పసివాడిలా గడగడా చెప్పేశాడు జయసూర్య.

నేను పసిపిల్లలా హాయిగా నవ్వేశాను. ఆ భవంతి మొత్తం తిరిగి చూసిన నేను అతని అభిరుచిని చూసి మెచ్చుకోకుండా వుండలేకపోయాను.

"సరి! సరి! చాలా పొద్దుపోయింది. రెస్ట్ తీసుకోండి. రేపు మాట్లాడుకుందాం. ఏవైనా అవసరమయితే రంగయ్య నడగండి. పొద్దున్నే ఫోన్ చేస్తాను!" అంటూ వెళ్ళిపోయాడు జయసూర్య.

అతను వెళ్ళాక నా మనసంతా చేదుగా అయిపోయింది. గుండెల్లో సన్నని బాధ మొదలయింది. భారంగా మంచంమీద వాలిపోయాను. నా బాధ తెలియని కిరీటి ఎన్నో కబుర్లు చెప్పి నవ్వించాడు. తర్వాత కిరీటి నిద్రలోకి జారిపోయాడు. కానీ నాకు మాత్రం నిద్రరాలేదు. అందుకే లేచి ఇలా బాల్కనీలోకి వచ్చాను.

అలాగే చాలాసేపు నిల్చున్నాను. కానీ నా మనసు కుదుటపళ్ళేదు. హృదయమంతా బరువుగా అయిపోయింది. పదే పదే జయసూర్య గుర్తొస్తున్నాడు. తపనగా నుదురు రాసుకుంటూ లోపలికొచ్చాను.

కిరీటి ఓ పక్కకి ఒదిగిపడుకున్నాడు. ఫేనుగాలికి జుట్టు చెదిరి నుదుటిమీద పడుతోంది. ఒత్తయిన మీసం, బలమైన శరీరం కిరీటి అందాన్ని ద్విగుణీకృతం చేస్తోంది. అమాయకంగా నిద్రపోతున్న కిరీటి మీద ప్రేమ పొంగింది. మెల్లగా దగ్గరికెళ్ళి జుట్టు సవరించాను. ఒంగి నుదుటిమీద ముద్దు పెట్టుకున్నాను.

మనసులో ఏవో ఆలోచనలు! గుండెల్లో బాధ! గజిబిజిగావున్న నా మనసులో ఓ కోరిక మొలకెత్తి క్షణాల్లో అది వృక్షంలా మారిపోయింది. ఓసారి జయ దగ్గరికెళ్ళి నా హృదయారాటాన్ని గురించి చెప్పాలి.

గడియారం కేసి చూశాను.

ఒంటిగంట! ఇప్పుడు నేను జయ దగ్గరికెళ్ళడం కిరీటి చూస్తే! అమ్మో!" అప్రయత్నంగా నా చెయ్యి గుండెలమీదికెళ్ళింది. ఒళ్ళంతా నీరసం ఆవరించేసింది. అయినా నాలోని కోరిక చావలేదు. ఒకలాంటి తెగింపు వచ్చేసింది. ఓసారి కిరీటికేసి చూసి, ఒంటి నిండా షాల్ కప్పుకుని మెల్లగా మేడ దిగాను. గుండె వేగంగా కొట్టుకుంది. అడుగులో అడుగు వేసుకుంటూ రోడ్‌మీది కెళ్ళాను. చలిగాలి ఎముకల్ని కొరికేసేలా వుంది. అయినా మొండిగా వీధి చివర్న వున్న జయ ఇంటికేసి నడిచాను. ఎలాగో జయ ఇంటికెళ్ళి అదురుతున్న గుండెలతో కాలింగ్ బెల్ నొక్కాను. మరునిమిషం జయ బాల్కనీలోకొచ్చి నన్ను చూసి కిందికి పరిగెత్తుకొచ్చాడు.

గేటు తీస్తూ-

"ఏవిఁటింత చలిలో! కిరీటి ఏడీ!" అన్నాడు కంగారుగా.

"కిరీటి రాలేదు. నేనొక్కదాన్నే వచ్చాను!" గొణిగినట్టు అన్నాను.

అతను మరింత హడిలిపోయాడు.

"మైగాడ్! ఇంత రాత్రప్పుడు...ఈ చలిలో... ఒంటరిగా వచ్చావా?" అంటూ నన్ను పొదివి పట్టుకొని లోపలికి తీసికెళ్ళి కూర్చోపెట్టాడు.

"మీ ఆవిడ..."

"పైన వుంది. కింద హాస్పిటల్. పైన రెసిడెన్స్! ఇది నా పర్సనల్ రూమ్. నువ్వు హాయిగా కూర్చో!" అంటూ వెళ్ళి వేడి వేడి హార్లిక్స్ తెచ్చి నాచేత తాగించాడు. తర్వాత అనునయంగా అడిగాడు. నేను పసిపిల్లలా నా మనసులో వున్నదంతా అతని ముందుంచాను.


అతని మొహం కళతప్పింది.

"జయా! నా హృదయంలోని బాధని నీకు చెప్పాను. ఈ హృదయస్పందనని నువ్వే అర్థం చేసుకోవాలి!" అన్నాను బేలగా.

తేరుకున్న అతను నవ్వాడు.

"అర్థం చేసుకున్నాను మున్నీ! నీ హృదయాన్ని నా చేతుల్లో పెట్టు. దాన్ని పదిలంగా చూసుకుంటాను" అన్నాడు నమ్మకంగా.

నా మొహం వెలిగిపోయింది. అతనుమాత్రం



## స్టిల్ ఓ.కే

అమితాబ్ ఇంకా ఎనర్జిటిక్‌గానే ఉన్నాడు. మీరు నాకోసం కేరక్టర్స్ క్రియేట్ చేయండి ఫైట్లు పెట్టండి. డ్యూయెట్లు పెట్టండి. కుర్రకారుతో పోటీపడి నటించకపోతే అడగండి. నావరకు నేను గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నా! ఇక మీదే ఆలశ్యం అంటున్నాడు అమితాబ్.

నా చేతిని తన చేతుల్లోకి తీసుకుని పరధ్యానంలో పడిపోయాడు.

అప్పుడే గేటు తీసిన చప్పుడైంది. నా గుండె క్షణం ఆగి తిరిగి రెట్టించిన వేగంతో కొట్టుకుంది. అంత చలిలోనూ ఒళ్ళంతా చెమటతో తడిసి ముద్దయిపోయింది.

"జయా! కిరీటేమో!" అన్నాను భయంగా. అతను మరింత కంగారుపడిపోతూ నన్ను తన మంచం మీద పడుకోబెట్టి బ్లాంకెట్ కప్పి-

"నువ్వేం కంగారుపడకు మున్నీ! కిరీటైతే ఏదో ఒకటి చెప్పి పంపేస్తాను. నువ్వు మాత్రం లేవకు" అంటూ బైటికి పరిగెత్తాడు.

నాలో అలజడి మరింత పెరిగిపోయింది. ఒళ్ళు స్వాధీనం తప్పుతోంది. అయినా మెల్లగా లేచి ఇవతలికొచ్చాను అతను గమనించకుండా.

నేనూహించినట్టు వచ్చింది కిరీటే. కిరీటిని చూడగానే నా దడ ఎక్కువైంది. వెన్నులోంచి ఒణుకులాంటిది మొదలయింది. కళ్ళు బైర్లు కమ్మాయి. అయినా ఎలాగో నిలదొక్కుకుని చీకట్లో ఓ పక్కగా గోడనాసరాగా చేసుకుని నిల్చున్నాను. వాళ్ళు నాకు సరిగ్గా కనిపించకపోయినా, వాళ్ళ మాటలు మాత్రం స్పష్టంగా వినిపిస్తున్నాయి.

కిరీటి ఏదో అడగబోతుండగానే -

"నువ్వేం కంగారు పడకు కిరీటి! మున్నీ ఇక్కడే వుంది!" అన్నాడు జయ మెల్లగా.

"థాంక్ గాడ్!" తేలిగ్గా నిట్టూర్చాడు కిరీటి.

"కిరీటీ! డాడీవాళ్ళు ఎప్పుడొస్తారు?" గంభీరంగా అన్నాడు జయ.

"బయల్దేరారంకుల్! తెల్లారేసరికి వచ్చేస్తారు. అయినా ఆపరేషన్ ఎల్లుండిగా!" అన్నాడు కిరీటి.

"లాభం లేదు కిరీటి! ఆపరేషన్ చేసే స్టేజీ దాటిపోయింది. ఇప్పుడావిడ పొజిషన్ చాలా క్రిటికల్‌గా వుంది. గాలి బుడగలా వున్న ఆమె గుండె ఏ క్షణంలోనైనా ఆగిపోవచ్చు. ఆవిడ జబ్బుని గురించి ఆమెకి తెలియకూడదని ఏవేవో చెప్పి ఇక్కడికి తీసుకొచ్చాం. కానీ ఫలితం వుండేలా లేదు. ఇప్పుడు మనం కోరుకోవలసిందల్లా మీ నాన్న, బాబాయిలు వచ్చేదాకా ఆమెగుండె ఆగకూడదని!" గద్గద స్వరంతో అన్నాడు జయ.

కుప్పకూలిపోయాడు కిరీటి!

వాడు నా ముద్దుల మనవడు. వాడికి నేనంటే ప్రాణం. వాడు మా వారు పోయినయేడే పుట్టడంతో వాడికి మావారి పేరు పెట్టుకుని, మళ్ళీ మావారే పుట్టారని మురిసిపోతుంటాను. నా కొడుకులిద్దరూ సింగపూర్‌లో స్థిరపడ్డంతో నన్నూ అక్కడికే తీసికెళ్ళారు. కానీ నేనక్కడ వుండలేక వచ్చేశాను. డెబ్బయిమూడేళ్ళ ఈ వృద్ధురాలు ఒంటరిగా వుండడం సహించలేని నా తండ్రి కిరీటి.... నా కోసం తల్లిదండ్రుల్ని వదిలి ఇంతదూరం వచ్చి నా దగ్గరుండి చదువుకుంటున్నాడు. నన్నో పసిబిడ్డలా చూసుకుంటున్నాడు. నా జీవనజ్యోతి ఆరిపోకుండా తన చల్లని చేతుల్ని అడ్డుగా పెడుతున్నాడు.

జయ మాటలు విన్న నాకు దుఃఖం ముంచుకొచ్చింది. మసగబారిన కళ్ళతో వాళ్ళకేసి చూశాను. కిరీటి ఏడుస్తుంటే అక్కున చేర్చుకొని ఓదారుస్తున్నాడు జయ.

"అంకుల్! ఎలాగైనా బామ్మని బతికించండంకుల్! నాకు మా బామ్మ కావాలి. అయ్ లైక్ మై గ్రానీ! అయ్ లవ్ మై గ్రానీ! అయ్ కాంట్ లివ్ వితౌట్ మై గ్రానీ!" పసివాడిలా ఏడుస్తున్నాడు కిరీటి.

"ఛ! ఏవిఁటిది. మీ బామ్మ వింటుంది. వింటే ఆవిడ పరిస్థితేవిఁటో ఆవిడకి తెలిసిపోతుంది. ఆ మరుక్షణం ఏం జరుగుతుందో...."

జయ మాటలు నాకు సరిగ్గా వినిపించడంలేదు. గుండె చల్లపడింది. చెమటలు మరింత దిగజారిపోతున్నాయి. ఎలాగో స్వాధీనం తప్పుతున్న శరీరాన్ని అతిప్రయాసగా మంచం మీదికి చేర్చి ఎప్పటిలా బ్లాంకెట్ కప్పుకుని కళ్ళు మూసుకున్నాను. నా గుండెల్లోని బాధక్కారణం ఏవిఁటో తెలుసుకుందామని వచ్చాను. జయ చెప్పకుండానే తెలిసిపోయింది. మరో రెండు నిమిషాల తర్వాత జయ, కిరీటి నా దగ్గరికొచ్చారు. శుష్కించి ఎండుపుల్లలా వున్న నా చేతిని తన చేతుల్లోకి తీసుకుని ఆతృతగా పల్స్ చూస్తున్నాడు. అతని కళ్ళలో విపరీతమైన ఆందోళన వుంటుందని నాకు తెలుసు. గాజుగోళాల్లా కాంతిహీనమైన నా కళ్ళు వర్షించి దిండుని తడిపేస్తున్నాయి.

"మున్నీ!" నా మీదికి వంగి మృదువుగా పిల్చాడు జయ. దుఃఖాన్నాపుకుంటూ కళ్ళు తెరిచి -

"జయా! నా హృదయాన్ని పదిలంగా చూసుకుంటానని నాకు మాట ఇచ్చావు కదూ?" అన్నాను దీనంగా.

తుళ్ళిపడ్డాడతను.

"ఇచ్చిన మాట ప్రకారం నా గుండె ఆగకుండా చూడు నేస్తం!"

"మున్నీ!"

"అవును! మున్నీనే! నీ చిన్ననాటి నేస్తాన్ని. హృదయ వేదనతో నీ ముందుకొచ్చాను. ప్లీజ్! నన్ను బతికించు!....." గుంటలుపడ్డ నా కళ్ళలో నీళ్ళు వూరుతూనే వున్నాయి.

"మున్నీ! ఏమ్మాటలివి! ఇప్పుడు నీకేమయిందని!" అన్నాడు జయ బలవంతంగా నవ్వుతూ.

"ఇంకా ఏం కాలేదు. కానీ అవుతుంది. అది ఈ క్షణాన కావచ్చు. మరోగంట తర్వాత కావచ్చు!" నాకు ఆయాసం మొదలయింది.

విషయం నాకు తెలిసిపోయిందని గ్రహించిన కిరీటి బావురుమన్నాడు. జయ మొహం నల్లబడింది. నా చెయ్యిమాత్రం అతని చేతిలోనే వుంది. నాలో బతకాలనే కోరిక పెరిగిపోయింది.

"జయా! నాకు చావంటే భయంలేదు. కానీ ఈ రాత్రి కన్నుముయ్యకూడదు. నా బిడ్డల్ని కళ్ళారా చూడాలి. చివరిసారిగా వాళ్ళతో మాట్లాడాలి. అందుకే... అందుకే.... వాళ్ళొచ్చేదాకా ఈ గుండె ఆగకుండా చూడు ఫ్రెండ్!" రెండు చేతులూ జోడిస్తూ అన్నాను.

జయ ఇంక నిగ్రహించుకోలేకపోయాడు. ఎండిబొమికుల పోగులా వున్న నా గుండెలమీద వాలి బావురుమన్నాడు. డెబ్బయ్యయిదేళ్ళ డాక్టర్ జయసూర్య ఆనాటి నా బాల్యనేస్తం జయే అయిపోయాడు. మా కళ్ళు జలపాతాలే అయ్యాయి.

రెండు క్షణాల తర్వాత షాక్ కొట్టినట్టు లేచి నా చెయ్యందుకుని పల్స్ చూశాడు జయ. తర్వాత పిచ్చాడిలా అరుస్తూ ఎవర్నో పిల్చాడు. క్షణాల్లో అన్నట్టు డాక్టర్లు, నర్సులు....: ఇంకా ఎవరో ఎవరో వచ్చారు. నన్ను స్ట్రెచ్చర్ మీదికి చేర్చారు.

అరగంట తర్వాత ఓ పెద్ద రూమ్‌లో వున్నాను. ఇంజక్షన్లు, సెలైన్లు, ఆక్సిజన్లు.... మందుల వాసనలు... డాక్టర్ల హడావిడి అంతా గందరగోళంగా వుంది. కళ్ళముందు నా వాళ్ళంతా మెదిలారు. గుండెల్లో విపరీతమైన బాధ! ఆ బాధ క్షణక్షణానికి పెరిగిపోతోంది. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. కిరీటి ఏడుస్తూ ఏదో అంటున్నాడు. అయితే అవి నా చెవికెక్కడంలేదు. రెప్పలు మూతలు పడిపోతున్నాయి. శరీరం స్వాధీనం తప్పుతోంది.... ఎటో వెళ్ళిపోతోంది.

❋